క్లుప్తంగా

గంగమ్మా చల్లంగా చూడమ్మా



మహిమ గల రాయిని మొక్కుతున్న భక్తులు

సంబేపల్లె: నల్ల గంగమ్మతల్లి చల్లంగా చూడు అంటూ భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. మండలంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిమ గల దేవరరాయిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అర్జున్‌కుమార్

సిద్దవటం: మండలంలోని మాధవరం–1 గ్రామంలో హెల్త్ కేర్ క్లినిక్ లో వైద్యుడు డాక్టర్ భవనాశి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. కడప అవ్వారు అర్జున్ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో గైనకాలజీ, స్కిన్, జనరల్ వ్యాధులు, బీపీ, షుగర్ వంటి వ్యాధులకు వైద్యులు డాక్టర్ అవ్వారు అర్జున్‌కుమార్, డాక్టర్ రాటాల శిరీష, డాక్టర్ సుష్మా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అజంతా ఫార్మసీ, ఫోర్ట్స్ ఫార్మసీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విస్తారంగా జీలుగ సాగు



విస్తారంగా సాగుచేసిన జీలుగ పంట

సిద్దవటం: ఏరువాకకు ముందుగా మండల రైతులు జీలుగ విత్తనాలు పొలాల్లో చల్లుకుని సాగు చేశారు. వరిసాగుకు నెల రోజులు ముందుగా విత్తి.. తర్వాత దుక్కి దున్ని మూడు రోజుల వరకూ నీరు పెట్టి మురగబెడతారు. ఇలా చేయడం వలన ఆకులు బాగా కుళ్లి పచ్చిరొట్ట ఎరువు తయారవుతుంది. దీంతో పంటకు రసాయన ఎరువులు వేయనవసరం ఉండదు. అధిక దిగుబడి కూడా సాధించవచ్చునని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

వైభవంగా కొండంపల్లి మాతమ్మ జాతర



అలంకరణలో మారమ్మ తల్లి

పుల్లంపేట: మండలంలోని కొండంపల్లి గ్రామంలో మాతమ్మ తల్లి జాతర నందు ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఏటా జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆగస్టు 8న చలో విజయవాడ



బొజ్జ సుమన్

రాయచోటి టౌన్: ఆగస్టు 8న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యుత్తు కార్మికుల రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బొజ్జ సుమన్ పిలుపునిచ్చారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న గుంటూరులో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించామని తెలిపారు. విద్యుత్ సంస్థలో గత రెండు దశాబ్దాలుగా సంస్థ కోసం కృషి చేస్తున్న కార్మికుల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. 10–15 సంవత్సరాలుగా సంస్థలో పనిచేస్తున్న షిఫ్ట్ వాచ్‌మెన్ కార్మికులు, పాత ఆపరేటర్లకు చెల్లించిన విధంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన వారికి షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టులకు అవకాశం కల్పించాలని, స్కిల్–హై స్కూల్ చేయాలని డిమాండ్ చేశారు.

మోసం చేసిన ప్రభుత్వం



భాస్కర్‌యాదవ్

నందలూరు: యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వాలంటీర్స్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బయనబోయిన భాస్కర్‌యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదికాలంగా ఉద్యోగం, ఉపాధి, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను మోసం చేసిందన్నారు. యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి యువకులు, నిరుద్యోగులు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వేడుకకు సిద్ధమవుతున్న గణనాథుడు

- కంప్యూటర్ గ్రాఫిక్స్ చూపి రంగులద్దుతున్న కళాకారులు
- విగ్రహాల తయారీలో రాజస్థాన్ వాసులు బిజీ బిజీ



సిద్ధమవుతున్న వినాయక విగ్రహాలు



విగ్రహాలను తయారు చేస్తున్న కళాకారులు

రాజంపేట టౌన్: పల్లె, పట్టణం తేడా లేకుండా వాడవాడలా ఘనంగా జరుపుకొనే వేడుక వినాయక చవితి. ఒకప్పుడు పెద్ద నగరాలకే పరిమితమైన ఈ వేడుకలు ఇప్పుడు అన్ని ప్రాంతాల్లోనూ ఘనంగా జరిపేలా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు 27వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తమకు నచ్చిన రీతిలో వినాయకులను ప్రతిష్ఠించేందుకు యువకులు ఇప్పటికే కళాకారుల వద్దకు చేరుకుని విగ్రహాలను ఎంచుకుంటున్నారు. రాజస్థాన్ నుంచి వచ్చిన కళాకారులు విగ్రహాల తయారీ పనుల్లో నిమగ్నమవుతున్నారు.

పనులు వేగవంతం

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధానమైన ప్రాంతాల్లో విగ్రహాలను తయారుచేసి, పూర్తిస్థాయి రూపు తీసుకొచ్చే పనులు వేగంగా చేపడుతున్నారు. మరో వారం రోజుల్లో విగ్రహాలకు రంగులు వేసే పనులు ప్రారంభిస్తామని కళాకారులు చెబుతున్నారు. ఇదిలా వుంటే చవితి వేడుకలకు మరో రెండు నెలలు మాత్రమే సమయం ఉండడంతో నిర్వాహకులు వేడుకల ఏర్పాట్లపై చర్చలు ఆరంభించారు.

ఆకర్షణీయమైన రంగులపై ఆసక్తి

ఉత్సవ కమిటీ ప్రతినిధులు తమ ప్రాంతాల్లో నెలకొల్పే విగ్రహాలు ఆకర్షణీయంగా ఉండేందుకు ప్రత్యేకమైన శ్రద్ధ కనబరుస్తారు. ప్రస్తుతం కొంత మంది ఉత్సవ కమిటీల నిర్వాహకులు విగ్రహానికి ఎలాంటి రంగులు వేస్తే ఆకర్షణీయంగా ఉంటాయో తెలుసుకొనేందుకు తొలుత కంప్యూటర్‌లో గ్రాఫిక్స్ ద్వారా విగ్రహాన్ని రూపొందించి ఆ తరువాత కళాకారులచే రంగులు వేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు వారు తయారు చేసి ఉంచిన విగ్రహం కొనుగోలు చేసే ఖర్చుకంటే ఎక్కువ అవుతుందని చెబుతున్నారు. అయినప్పటికీ రంగులు వేయించుకునేందుకు అడ్వాన్స్‌లు కూడా ఇస్తున్నట్లు వారు తెలిపారు.

గణపయ్యపై భారం వేసి......

గణనాథుల విగ్రహాలను రాజస్థాన్ కళాకారులు మాత్రమే ఏళ్లుగా తయారు చేస్తున్నారు. వినాయక చవితి వేడుకకు దాదాపు రెండున్నర నెలల నుంచి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ఉపయోగించి విగ్రహాల తయారీ పనులు ప్రారంభిస్తారు. ఈ విగ్రహాలతో దుష్ఫలితాలున్నాయని ఏటా ఆయా ప్రభుత్వాలు చెబుతూనే వస్తున్నాయి. అయితే గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వినాయక చవితి సమీపించే సమయంలో మట్టి విగ్రహాలనే కొలువుదీర్చాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అప్పట్లో కళాకారులకు నోటీసులుకిచ్చారు. గత ఏడాది ప్రభుత్వం మట్టి విగ్రహాలను ఏర్పాటుచేయాలని ఆదేశించే సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలను వ్యాపారులు తయారు చేయించి విక్రయాలకు సిద్ధంచేసి వుంచారు. అందువల్ల ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించకుండా వెనకడుగువేసింది. ఆ తరువాత ప్లాస్టర్ ఆఫ్ ప్యారీ విగ్రహాలపై కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఈ ఏడాది కళాకారులు, వ్యాపారులు బొజ్జగణపయ్యపై భారం వేసి విగ్రహాలను తయారు చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలను ఏర్పాటు చేయకూడదని ప్రభుత్వం గట్టిగా నిర్ణయిస్తే వ్యాపారులు కోట్లల్లోనే నష్టపోవాల్సి వస్తుంది.

రంగుల విగ్రహాలనే ఇష్టపడతారు



వినాయక చవితి ఉత్సవాలు చేసేవారంతా రంగుల విగ్రహాలనే కొలువు దీర్చేందుకు ఇష్టపడతారు. అందువల్ల రంగుల విగ్రహాలనే తయారుచేస్తున్నాం. వినాయక చవితి పండగకు మరో రెండు నెలలు మాత్రమే సమయం ఉండడంతో రేయింబవళ్లు రెండు షిఫ్టుల్లో విగ్రహాల తయారీ పనులు చేస్తున్నాం. విగ్రహాలను తయారు చేస్తే మేము కడుపునింపుకోగలం.

– మోహన్, విగ్రహాల తయారీ కళాకారుడు, రాజస్థాన్

పర్యావరణానికి పెను ముప్పు



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతుంది. వినాయక చవితి సందర్భంగా దేశవ్యా ప్తంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలను కొలువుదీర్చి ఆ తరువాత నిమజ్జనం చేస్తారు. విగ్రహాలు భూమిలో కలిసిపోవడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. రంగులు సీసం, రసాయనాలతో కూడినవి కావడంతో జలజీవరాసులు మృతి చెందుతాయి. మట్టి విగ్రహాలనే కొలువుదీర్చాలి.

– జి.చక్రధర్‌రాజు, నేషనల్ గ్రీన్‌కోర్ రీజనల్ కో–ఆర్డినేటర్

ఓసూరు ఎల్లమ్మకు పొంగళ్లు



ఓసూరు ఎల్లమ్మ దేవతకు పొంగళ్లు పెడుతున్న మహిళలు

చిట్వేలి: మైలపల్లి పంచాయతీలోని 4 గ్రామాలకు ఆరాధ్య దేవతగా విరాజిల్లుతున్న ఓసూరు ఎల్లమ్మ దేవతకు ఆదివారం పొంగళ్లు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మైలపల్లి సమీపంలో అలుగు ఏరు ఒడ్డున వెలసిన ఎల్లమ్మ దేవత తిరునాళ్లు ఏటా శుక్రవారం ప్రారంభమై.. గ్రామోత్సవం ఏడు గ్రామాలకు చేరుకుని ఆదివారం ఆలయానికి చేరుకోవడంతో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది తిరునాల చేయకపోవడంతో అమ్మవారికి పొంగళ్లు పెట్టి బలిదానాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే తిమ్మాయపాలెం పంచాయతీ గట్టు మీదపల్లిలో గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

మల్లూరమ్మకు పూజలు



మల్లూరమ్మ తల్లికి అలంకరణ

చిన్నమండెం: మండలంలోని మల్లూరు గ్రామం మాండవ్యా నదిపై కొలువైన మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఆదివారం ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరినవారు బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందు ఆరగించారు.

వికసిత భారత్ లక్ష్యంగా మోదీ పాలన



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

పుల్లంపేట: వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పాలన సాగుతోందని బిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పోతుగుంట రమేష్‌నాయుడు, జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాని మోదీ ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద దేశంలో 81 కోట్ల మందికి ఉచితంగా బియ్యం పంపిణీ చేశారని, హర్ ఘర్ జల్ కార్యక్రమం క్రింద ప్రతి ఇంటికీ కుళాయి మంజూరు చేయించారని అన్నారు. నాలుగు కోట్ల మందికి ఇల్లు, పేదలకు ముద్ర రుణాలు ఇవ్వడం, కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం క్రింద ఏడాదికి రూ. 6 వేలు ఇవ్వడం ఆయన హయాంలో కీలక నిర్ణయాలు అన్నారు. అనంతరం వారు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ గడ్డం చెంగల్ రాజు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసులు, రామసుబ్బారెడ్డి, తోట శ్రీనివాసులు, సాదు సుబ్బరాయుడు, ఎం సుబ్బరాయుడు, పర మేష్, ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు

పెనగలూరు: మండలంలోని కేజీ సముద్రం ఎస్టీ కాలనీ వాసులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఎంపీడీఓ విజయారావు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకు అన్ని శాఖల అధికారులతో కలిసి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎస్టీ కాలనీలో 21 మందికి ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డు, 35 మందికి జన్‌ధన్ అకౌంట్లు, ఏడుగురికి పీఎం కిసాన్ ఎన్‌రోల్‌మెంట్, ఇద్దరికి సికిల్ సెల్ అనీమియా కిట్లు, 52 మందికి రేషన్ కార్డులు, 22 మందికి కుల ధ్రువీకరణ, 105 మందికి ఆదాయ ధ్రువపత్రాతలు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని ఆయా శాఖల సిబ్బందిచే పరిష్కరిస్తామని అన్నారు. సర్పంచ్ రామాంజులమ్మ పాల్గొన్నారు.

చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకం



పొక్లెయిన్‌తో మట్టి తోడుతూ..

రైల్వేకోడూరు అర్బన్: ప్రభుత్వ భూములు, చెరువులు, ఏర్లలో అక్రమ మట్టి తవ్వకాలు జోరందుకున్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టా రాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. అనంతరాజుపేట పంచాయతీలోని చిన్నంగి చెరువులో 12 లారీలు పెట్టి ఆదివారం మట్టి తరలిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రియల్ ఎస్టేట్ దందా చేస్తూ ప్లాట్ల విస్తరణకు మట్టి తరలిస్తున్నారు. నిత్యం ఏదో చెరువులో మట్టి, ఏర్లలో ఇసుక తరలిస్తూ కోట్లు సంపాదిస్తున్నారు. తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా పనులు ఆపించామని చెబుతున్నారేగానీ చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీకృష్ణ

నందలూరు: మండల కేంద్రంలోని బస్టాండు కూడలి సమీపంలో రాజంపేట పట్టణానికి చెందిన డాక్టర్ కృష్ణాస్ లైఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 150 మంది రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకృష్ణ మాలేపాటి మాట్లాడుతూ తమ వద్ద అన్ని రకాల ఎండోస్కోపిక్, ల్యాపరోస్కోపిక్, చెవి, ముక్కు, గొంతు, కోత కుట్టు లేని ఆపరేషన్లు చేయబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.విన్య, డాక్టర్ సోహెల్, విజయసాగర్, ఉప్పుశెట్టి రెడ్డయ్య, ఉప్పుశెట్టి సుధీర, మోడపోతుల రాము, చక్రాల సాయినాథ్, రోగులు పాల్గొన్నారు.

ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

చిన్నమండెం: చిన్నమండెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1993–94 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒకచోట కలిసి సంతోషంగా గడిపారు. ఆదివారం పాఠశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి విద్యార్థులు హాజరై తమ జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గురువుల పాఠాల వల్లే తమ జీవితాలలో మార్పు వచ్చిందని విద్యార్థులు ఉద్వేగంగా పేర్కొన్నారు. ఈ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

భూగర్భ వంతెన సాధించిన ఘనత వైఎస్సార్‌సీపీదే

- 24 గ్రామాల ప్రజలకు తప్పనున్న ఇబ్బందులు
- 2 వేల మంది విద్యార్థులకు మేలు
- ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



భూగర్భ వంతెనను పరిశీలిస్తున్నఎంపీ మిథున్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు నియోజకవర్గంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిదేనని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికారప్రతి నిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్ డబుల్ వే బ్రిడ్జి పనులను ఆదివారం వారు పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దశాబ్దాలుగా చేపట్టలేని, ఎవరూ పట్టించుకోని రైల్వే అండర్ బ్రిడ్జిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేయించడం జరిగిందన్నారు. చుట్టుపక్కల గ్రామాలకు కనెక్టింగ్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకొంటామని, దశాబ్దాల కల నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ 24 గ్రామాలకు, వేల మంది విద్యార్థులకు ఈ బ్రిడ్జి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంపి పెద్దిరెడ్డిమిథున్‌రెడ్డి సహకారంతో రూ.10.60 కోట్లు వంతెన నిర్మాణానికి మంజూరు చేయించామన్నారు. కూటమి నాయకులు కొత్త పనులు తేలేకపోయినా గత ప్రభుత్వంలో తాము మంజూరు చేయించిన పనులు నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేయాలని కోరారు. ప్రజలకు ఏదైనా చేయాలనే తపనతో తాము పనిచేశామని, రూ.2200 కోట్లతో గ్రీన్ ఎక్స్‌ప్రెక్స్ హైవేకు నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఆ పనులు చేసుకోలేని దుస్థితిలో కూటమి నాయకులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యుడు భరత్‌కుమార్‌రెడ్డి, సర్పంచులు చంద్రశేఖర్, శివయ్య, సురేష్‌బాబు, సీహెచ్. రమేష్, మండల నాగేంద్ర, గునిశెట్టి రమేష్, కొరెడ్డి సిద్దయ్య, బండారుమల్లి, కాంట్రాక్టర్లు శ్రీనివాసులు రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మండలంలోని సూరపురాజుపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత జైలర్ ముద్దనూరు వెంకటసుబ్బరామరాజు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని ఆదివారం ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు వారి కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ సుబ్బరామరాజు, తదితరులు పాల్గొన్నారు.


కొండూరులో ఎంపీ తేనేటి విందు



తేనేటి విందులో ఎంపీ మిథున్‌రెడ్డి, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు

పెనగలూరు: మండలంలోని కొండూరులో రాజంపేట మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ విజయ్‌రెడ్డి కుటుంబీకులు ఇచ్చిన తేనేటి విందుకు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి హాజరయ్యారు. తేనేటి విందు ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, తదితర కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ పార్టీ పరిస్థితి, రాష్ట్రంలో పరిస్థితులపై గంటకు పైగా ఎంపీ చర్చించారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని విందు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కేతాచక్రపాణి, సిద్దవరం శ్రీనివాసులురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

23న యువత పోరు



నాగేంద్రనాయక్

సుండుపల్లె: విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన బకాయిలు చెల్లించాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామస్వామిరెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ రెహమాన్ ఖాన్, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర నాయక్ చౌహాన్ డిమాండ్ చేశారు. విలేకరులతో వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు రూ.3 వేల భృతి చెల్లించాలని, కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఉపసంహరించుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ కూటమి సర్కార్‌పై నిరసన గళం తెలపడానికి ఈ నెల 23న తలపెట్టిన యువతపోరు కార్యక్రమం విజయవంతం చేయాలని వారు కోరారు.

రోగులకు వైద్య చికిత్స



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు విజయభాస్కర్ రెడ్డి

వీరబల్లి: మండలంలోని వీరబల్లి పంచాయతీ ఈడిగపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. 200 మందికికి రాయచోటి విజయ హాస్పిటల్ డాక్టర్ యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు జరిపారు. రోగుల జబ్బును బట్టి మాత్రలు ఉచితంగా పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి శిబిరాన్ని సందదర్శించి డాక్టర్ యుగంధర్‌రెడ్డిని శాలువా, పూలమాలతో సన్మానించారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఉపయోగపడతాయన్నారు. రోగులు శిబిరంలో పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని సూచించారు.

కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగిద్దాం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



కార్యక్రమంలో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చెసిన కూటమి ప్రభుత్వానికి యువత పోరు ద్వారా కనువిప్పు కలిగించాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన నందిరెడ్డిగారిపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకుడు మదార్‌సాబ్ ఇంట జరిగిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. తర్వాత బండపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకుడు అశోక్ రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల అతని భార్య మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. యువ నాయకుడు బండపల్లె కృష్ణారెడ్డి ఇంటిని సందర్శించారు. అనంతరం ఆయన వైఎస్సార్ సీపీ మదనపల్లె నియోజక వర్గ సమన్వయ కర్త నిస్సార్ అహ్మద్‌తో కలసి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదికే ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. అన్ని వర్గాలను చంద్రబాబు దగా చేస్తున్నారన్నారు. మాటలతో కాలయాపన చేస్తున్నారన్నారు. విద్యార్థులను, యువతను మోసం చేసిన ప్రభుత్వ కళ్లు తెరిపించేందుకు సోమవారం చేపట్టిన యువత పోరును విజయవంతం చేయాలన్నారు. ఏడాది కావస్తున్నా నిరుద్యోగులకు ఇచ్చిన హామీ అమలు గురించి పట్టించుకోవడం లదేన్నారు.ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. తప్పుడు కేసులకు భయపడేదిలేదని తెలిపారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని అన్నారు. రాష్ట్ర ప్రజలు జగనన్న సంక్షేమ పాలన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీలో యువత పాత్ర కీలకమని తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే యువత పోరు నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై మున్సిపల్ కార్మికుల నిరసన



ఒంటికాలిపై నిలిచి నినాదాలు చేస్తున్న కార్మికులు

మదనపల్లె: మదనపల్లె మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెలో భాగంగా ఆదివారం 19వ రోజు దీక్షా శిబిరంలో కార్మికులు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మిక జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంజినీరింగ్ కార్మికులు 45 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోయారు. సమాన పనికి సమాన వేతనం, టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేతనం అడుగుతున్నామని అన్నారు. వేతనం తక్కువగా ఇస్తూ.. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడం లేదన్నారు. న్యాయమైన డిమాండు తీర్చకపోతే సోమవారం నుంచి మెరుపు సమ్మె చేస్తామని ప్రకటించారు. ప్రతి రోజు ప్రజలకు వీధి లైట్లు, తాగునీటి సరఫరా సేవలను నిలిపివేస్తామని అన్నారు. దీక్షలో ఎస్కే. రెడ్డప్ప, ఎంఎస్.కన్నయ్య, నాగరాజు , బాబు, బాలకృష్ణ, సజాద్ , కుమార్, రాజేశ్వరి, కార్మికులు పాల్గొన్నారు